క్లుప్తంగా

విరాళం అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో కోటిలింగాల ప్రతిష్ఠ, ధ్యాన కేంద్రం, పంచలోహ లింగం ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన అనిత, వై.వెంకటేష్ దంపతులు తమ వంతు సహాయంగా రూ.27,116 విరాళంగా ఆలయ నిర్వాహకులు శేఖరయ్యకు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న పుణ్య కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని నిర్వాహకులు కోరారు.

అడ్‌హక్ కమిటీ ఎన్నిక



గోపాల్‌పేట: మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గట్టు స్వామి ఆధ్వర్యంలో మండల ఎమ్మార్పీఎస్ అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. తాడిపర్తి అధ్యక్షుడిగా అడ్డాకుల పవన్‌కళ్యాణ్, పొలికెపహాడ్ అధ్యక్షుడిగా గువ్వల మహేష్, మున్ననూరు అధ్యక్షుడిగా మనిగిల్ల నరేష్, ఏదుట్ల అధ్యక్షుడిగా కార్తీక్, గోపాల్‌పేట అధ్యక్షుడిగా షాన్‌ను ఎన్నుకున్నారు. వీరు గ్రామాల్లో పూర్తి స్థాయి కమిటీలను ఎన్నుకుంటారని గట్టు స్వామి తెలిపారు. కార్యక్రమంలో చెన్నయ్య, బాల్‌రాజు, మహేష్, శరత్‌కుమార్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



పాన్‌గల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వేణు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. గతంలో చిన్న చిన్న కేసులు ఉన్నవారు లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు.

అర్హులందరికీ పథకాలు



ఖిల్లాఘనపురం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నారని సర్పంచ్ అనుమోని కృష్ణవేణి అన్నారు. బుధవారం మండలంలోని అప్పారెడ్డిపల్లి, మానాజీపేట గ్రామాల్లో సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, అధికారులు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్రం అనేక పథకాల అమలు చేస్తుందన్నారు.

కరాటే విజేతలకు అభినందన



పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు దుర్గ, ఇంద్ర, దీక్షిత, దీపిక, అర్చన, గాయత్రి, అక్షయ, మౌనిక, భార్గవి, రజియా కతాస్ విభాగంలో షోటోకాన్ కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం వేణాచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

అలంపూర్: ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే విజయుడు బుధవారం పరామర్శించారు. అయిజ మండలం వేణిసోంపురం గ్రామానికి చెందిన నిరంజీ రోడ్డు ప్రమాదానికి గురై మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.



ప్రజల చెంతకు పాలన

- నేటి నుంచి ప్రజాపాలనకు గ్రామసభలు
- గ్రామసభలతోనే లబ్ధిదారుల ఎంపిక
- అర్హులకే ప్రభుత్వ పథకాలు



అమరచింతలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ స్వరణ్‌సింగ్



కొత్తకోటలో మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీల పథకంలో భాగంగా ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ కృష్ణయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీవైస్ చైర్మన్, ప్రత్యేక అధికారి యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు అర్హులందరికీ పథకాలు అందేలా చొరువ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీఓ రవిందర్‌బాబు, మండల వ్యవసాయ అధికారి షేక్ మున్నా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రజల చెంతకు ప్రజాపాలన వస్తుందని, అర్హులైన వారందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలనకు సంబంధించిన కార్యక్రమంపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 28న మేడేపల్లి, దేవరపల్లిలో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నరేందర్, ఎంపీఓ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై దరఖాస్తు

వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబం ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవాలని, అభయ హస్తం దరఖాస్తుతో పాటు విద్యుత్ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఈ నాగేంద్ర కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో విద్యుత్ సవరణ బిల్లు, వోల్టేజ్ సమస్య, లూజ్ వైర్లు, శిథిలావస్థలో, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, వైర్ల సమస్యలకు ప్రత్యేకంగా దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

పాన్‌గల్: ప్రజాపాలన గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ జిల్లా అధికారి రహెమాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గురువారం అన్నారం, అన్నారంతండా, బహదూర్‌గూడెం, బండపల్లి, శాగాపూర్‌తండా, దొండాయిపల్లి గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రాంబాయి, ఎంపీఓ రఘురాములు, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఎస్‌ఐ వేణు, ఐకేపీ ఏపీఎం సక్రూనాయక్, డీటీ అశోక్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ పాండునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజాపాలన సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, అధికారులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: అభయ హస్తం గ్యారంటీ పథకాలకు అధికారులు సమన్వయంతో వ్యవహరించి అర్హులకు అందించాలని తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ కతలప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 28న రంగవరం, కొర్లకుంట, నాగర్లబండ తండా, వల్లభాపురంతండాలో ప్రజల నుండి దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ శ్రీనిసులు, వ్యవసాయాధికారి డాకేశ్వర్ గౌడ్, పంచాయతీ రాజ్ ఏఈ మెహర్ తేజ, ఏపీఓ శేఖర్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరచింత: పారదర్శకంగా గ్రామ సభలను నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా మార్కెట్ మేనేజర్ స్వరణ్‌సింగ్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ప్రజాపాలనకు సంబంధించి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ చుక్క.మాలతి, వైస్ఎంపీపీ బాల్‌రెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి ఉన్నారు.

మదనాపురం: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని మండల స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున్, తహసీల్దార్ అబ్రహాం లింకన్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో ప్రజాపాలన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు.

నేడు వాహనాల వేలం

ఆత్మకూర్: ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పలు దాడుల్లో పట్టుబడ్డ వాహనాలకు గురువారం వేలం నిర్వహిస్తున్నామని సీఐ బాలరాజు తెలిపారు. రెండు కార్లు, మూడు ద్విచక్రవాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 28వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేలు డిపాజిట్ ముందస్తుగా చెల్లించాలని కోరారు.

పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని పీహెచ్‌సీ స్థాయి పెంచి, పూర్తి స్థాయి వైద్యులను నియమించాలని జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్ మంగళవారం మహబూబ్‌నగర్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి 108 అంబులెన్సును కేటాయించడంతో పాటు ఫర్నీచర్ ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఉన్న హోమియోపతి కేంద్రం సెంటర్‌ను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాములుయాదవ్, వెంకట్రాములు, గంగాధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి అక్షతల ఊరేగింపు

మదనాపురం: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి తలంబ్రాలను మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు గురుస్వామి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆధునిక సాగుపై దృష్టిసారించాలి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వరినాటు యంత్రాన్ని నడుపుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: మారిన కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలని.. దీంతో ఆర్థిక భారం తగ్గనుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని నాగవరంలో వరినాటు యంత్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు రుణాలతో వ్యవసాయ అనుబంధ యంత్రాలను కొనుగోలు చేసుకోవచ్చన్నారు. వరినాటు యంత్రాన్ని కొనుగోలు చేసిన రైతు వెంకట్‌రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు.

రేషన్‌కార్డు దరఖాస్తులను స్వీకరించాలి..

నేటి నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన గ్రామసభల్లో రేషన్‌కార్డు దరఖాస్తులు సైతం స్వీకరించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. ఈ విషయాన్ని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించినట్లు చెప్పారు. తొమ్మిదిన్నర ఏళ్లుగా కొత్త కార్డులు జారీ చేయకపోవడంతో చాలా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని.. ప్రస్తుతం రేషన్‌కార్డు ఆధారంగా ఆరు గ్యారెంటీలను వర్తింపజేస్తుండటంతో వారిలో అయోమయం నెలకొందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్యయాదవ్, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని దత్తాయిపల్లికి చెందిన సా తర్ల గోవర్ధన్ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించా రు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట ఎంపీపీ కిచ్చారెడ్డి, గొల్ల వెంకటయ్య, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలు



అమరచింత: సరస్వతి శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలుగా ఉన్నాయని, ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు దేశభక్తి అలవర్చుకొని దేశాన్ని గౌరవించే స్థాయికి ఎదుగుతారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిరంలో బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత చరిత్రలతో పాటు ఇక్కడి ఇతిహాసాలను బోధించడంతో క్రమశిక్షణను అలవర్చుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులతో పాటు పెద్దలను గౌరవిస్తూ తమ లక్ష్య సాధనలో ముందుకు సాగుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయ్, రాములు, సురేందర్, ఊషన్న, మహేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు



బండపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన వైస్ ఎంపీపీ శేఖర్



అన్నారం ప్రాథమిక పాఠశాలలో..

గోపాల్‌పేట: విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే సమస్యలు పరిష్కరించేందుకు అన్నివేళలా అందుబాటులో ఉంటామని మండల వైస్ ఎంపీపీ శేఖర్ అన్నారు. బుధవారం ఆయన ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, స్థానికులతో కలిసి బండపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఇటీవల పురుగుల బియ్యంతో విద్యార్థులకు వంట చేసిపెట్టడంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై వైస్ ఎంపీపీ శేఖర్ కొన్ని రోజుల క్రితం జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి విద్యార్థుల సమస్య చిన్నదిగా చూడొద్దు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంపైనే విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకునేందుకు సందర్శించామని వైస్ ఎంపీపీ చెప్పారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే సరిష్కరిస్తామని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు చెప్పారు.

భోజనం నాణ్యతగా అందించాలి

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించేలా ప్రతి నిత్యం పాఠశాల హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పనులకు పంపించొద్దు



చిక్కేపల్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న సీఆర్పీలు



అమరచింతలో..

పాన్‌గల్: బడిఈడు కలిగిన పిల్లలతో పనులు చేయింకుండా వారిని తప్పకుండా బడులకు పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి అన్నారు. బుధవారం మండలంలోని చిక్కేపల్లి, శాగాపూర్ తండాల్లో సీఆర్పీలు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ బడిఈడు పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల ఉన్న పిల్లలు బడి మానేయడానికి గల కారణాలపై వారు ఆరా తీశారు. బడిఈడు పిల్లలు చదువుకోవడం వారి హక్కు అని, వారి హక్కులకు భంగం కలిగించకూడదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, మధ్యాహ్నభోజనం, దుస్తులు, నాణ్యమైన విద్య అందిస్తున్నారని, దీంతో తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించి బడుల బలోపేతానికి తోడ్పాటునందించాలని వారు తల్లిదండ్రులకు సూచించారు.

అమరచింత: పట్టణంలో సీఆర్పీ స్వామి ఆధ్వర్యంలో బుధవారం బడి బయటి విద్యార్థుల గుర్తింపు సర్వేను నిర్వహించారు. ఈమేరకు బడి మాని ఇంటి వద్దే పనులు చేసుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు. బడిమానిన ముగ్గురు విద్యార్థులను మళ్లీ బడిలో చేర్పించామని సీఆర్పీ తెలిపారు.

డీటీగా లక్ష్మీకాంత్



పెబ్బేరు రూరల్: స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌గా లక్ష్మీకాంత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వీపనగండ్ల మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న లక్ష్మీకాంత్‌ను పెబ్బేరుకు బదిలీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డీటీ విజయసింహ వనపర్తి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

దుప్పి మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రబండ తండాకు చెందిన రైతు రాత్లావత్ లాలు వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతంతో దుప్పి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫారెస్టు రేంజర్ శరత్‌చంద్రారెడ్డి వివరాల ప్రకారం వేరుశనగ పంటకు రైతు విద్యుత్‌కంచెను ఏర్పాటు చేశారు. మూడు రోజుల కిందట దుప్పి విద్యుత్ కంచెకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రైతు దుప్పి కళేబరాన్ని అక్కడే పాతిపెట్టాడు. ఈ విషయం ఫారెస్ట్ అధికారులకు తెలియడంతో బుధవారం తండాకు చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి దుప్పి కళేబరాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై రైతు లాలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఫారెస్టు రేంజర్ తెలిపారు.

ఉపన్యాస పోటీలు



పోటీలో భాగంగా ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థి

అమరచింత: స్వామి వివేకానంద 161వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏబీవీపీ మండల, పట్టణ కన్వీనర్లు రాజేష్, అఖిల్ మాట్లాడుతూ విద్యార్థులకు వివేకానంద జీవితం, యువతకు ఇచ్చిన స్ఫూర్తి, జాతికి ఇచ్చిన సందేశం అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు వివేకానంద జయంతి జనవరి 12న బహుమతులను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోర్ల భరత్, తిరుమలేష్, కిషోర్, భరత్, లోకేష్, నారాయణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు శేఖరయ్య తెలిపారు. పరమ శివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో శివలింగానికి భక్తులు పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ఆలయంలోని శివలింగానికి పాలాభిషేకం చేస్తూ మొక్కలు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బాలల హక్కులకు భంగం కలిగించొద్దు

- ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు
- జిల్లా షీటీం ఎస్‌ఐలు అంజద్‌అలీ, ఇందిర



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న షీటీం ఎస్‌ఐలు

ఆత్మకూర్: బాలలను బలవంతంగా పనులకు పంపడం, బాల్యవివాహాలు చేయడం వంటి బాలల హక్కులను భంగం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని, అలాంటి వారు శిక్షార్హులవుతారని జిల్లా షీటీం ఎస్‌ఐలు అంజద్‌అలీ, ఇందిర అన్నారు. బుధవారం ఎస్పీ రక్షిత కే మూర్తి ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండలంలోని మూలమళ్ల ఉన్నతపాఠశాలలో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, షీటీంల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, చిన్నారులపై వేధింపులు, మాదకద్రవ్యాలు, బాల్యవివాహాలు, మహిళా రక్షణ, సైబర్ నేరాలు, హ్యూమన్ ట్రాఫికింగ్, ఉమెన్‌హెల్ప్ డెస్కులు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టం, ఇంటర్నెట్ భద్రత, బాలల తరలింపు, సోషల్ మీడియా, 1098, 100 డయల్ టోల్‌ఫ్రీ నంబర్లు, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసే విధానం గురించి క్లుప్తంగా వివరించారు.

స్వామియే శరణం అయ్యప్ప



ఖిల్లాఘనపురం లో ఇరుముడితో శబరికి వెళ్తున్న మాలధారులు



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: హరిహరపుత్ర అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవ పూజలు బుధవారం ఆత్మకూర్ శివారులోని మల్లాపురం క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ వేదపండితులు గోపాలకృష్ణమూర్తి, వెంకటశేషశర్మ, కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం, ఆలయ ప్రదీక్షణం, హోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం పూజలు చేశారు. పిన్నంచర్ల గోవిందస్వామి కుమారులు బంగారు భాస్కర్, ప్రకాష్, రవి ఆధ్వర్యంలో మల్లాపురంలోని ప్రాంగణంలో గతేడాది నూతన అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. ఈసందర్భంగా పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించి మాలధారులకు, భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కమ్మరిగేరి శివాలయంలో బుధవారం అయ్యప్పస్వామి పడిపూజ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొనిమెట్ల పూజలు నిర్వహించారు. 28 మంది స్వాములు ఇరుముడి కట్టుకుని ఆలయం చుట్టు ప్రదక్షణలు చేస్తు అయ్యప్పస్వామిను స్మరించారు. అనంతరం స్వాములకు బిక్ష, భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వాములను గ్రామ వెలుపలి వరకు బాజాబజంత్రీలతో శబరిమలైకి సాగనంపారు.

అదుపుతప్పి కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



కొత్తకోట రూరల్: అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటన కొత్తకోట మండలంలోని ముమ్మళ్లపల్లి వద్ద జాతీయ రహదారి 44పై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారు డ్రైవర్ వెంకటయ్యతో పాటు ప్రియ, స్వర్ణ, మంజుల, చిన్నారులు నగేష్, సహన, నిహాల్, కార్తీకేయలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు వేగం తక్కువగా ఉండటంతో కారులో ఉన్న వారందరూ ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి

ఆత్మకూర్: ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుతాఘాతంతో మూడు ఆవులు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని రేచింతలలో చోటు చేసుకుంది. గ్రామ శివారులోని భీమేష్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఉన్న 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గ్రామానికి చెందిన ఆవుల లాల్‌కు చెందిన రెండు ఆవులు, భీసన్నకు చెందిన ఒక ఆవు మేత కోసం వెళ్లి మృత్యువాతపడ్డాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఘటన జరిగిందని, రైతులకు రూ.రెండు లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం అన్నివిధాలుగా బాధిత రైతులను ఆదుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు.